06ATP27_06ATP27.qxd 09-03-2024 PM 10:24 Page 1



## వైసీపీ వీడి తెలుగుదేశంలో చేరికలు

**- పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి పాపిరెడ్డి పల్లి గ్రామస్తులకు కండువాలు వేసిన సవిత**

పెనుకొండ, మార్చి 9 ప్రభాతవార్త


పార్టీలో చేరిన వారితో సవిత

వైసీపీ వీడి తెలుగుదేశంలో చేరికలు జోరందుకున్నాయి. శనివారం పెనుకొండలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిగి మండలం శ్రీరంగరాజు పల్లి, పాపిరెడ్డి పల్లి గ్రామస్తులు వైసీపీ పార్టీని వీడి 13 కుటుంబాలు టిడిపికి చేరారు. సవిత వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో భాస్కర్, మారుతి, సురేష్, వెంకటేష్, సోమన్న, వెంకటేష్, జయశంకర్, గంగప్ప, శ్రీరాములు, గణేష్, నవీన్, సిద్దప్ప, రామాంజినేయులు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కండువాలు వేస్తున్న సవిత

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించండి

అగళి, మార్చి 9 ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధాకర్

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, కన్వీనర్ లోకేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్, బి.బ్లాక్ అధ్యక్షులు త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## టోర్నమెంట్‌ను ప్రారంభించిన గ్రీన్ భారత్ అధ్యక్షులు

అగళి, మార్చి 9 ప్రభాతవార్త

నేషనల్ గ్రీన్ భారత్ అధ్యక్షులు శంకర్‌నారాయణ అగళి ఉన్నత పాఠశాలలో టెన్నిస్‌బాల్ గ్రీన్ భారత్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గ్రీన్ భారత్ టీం రెండు జట్లపై విజయం సాధించడంతో వారికి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ని కూడా ప్రధానం చేశారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు రొళ్ల జడ్పిటిసి అనంత రాజ్‌తోపాటు, అగళి జడ్పిటిసి ఉమేష్, రామణపల్లి దివంగత తెలుగుదేశం పార్టీ నాయకులు కాంతరాజు తనయుడు మంజునాథ్ భోజన ఏర్పాట్లను చేయగా నియోజకవర్గ గ్రీన్ భారత్ అధ్యక్షులు కామరాజు 10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మ్యాన్ ఆఫ్ మ్యాచ్‌గా నిలిచిన వారికి మరో 500 ప్రకారం కామరాజు పంపిణీ చేశారు.

## హాస్టల్ ప్రాంగణంలో మొక్కలు నాటిన గ్రీన్‌భారత్ అధ్యక్షులు

అగళి, మార్చి 9 ప్రభాతవార్త


మొక్కలు నాటుతున్న దృశ్యం

అగళి హాస్టల్ ప్రాంగణంలో నేషనల్ గ్రీన్ భారత్ అధ్యక్షులు, చైర్మన్ మొక్కలను నాటి నీళ్ల పోశారు. గత 20 ఏళ్ల క్రితం గ్రీన్ భారత్ అధ్యక్షులు శంకర్ నారాయణ, అగళి ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా ఉంటూ గ్రీన్ భారత్ వాలెంటీర్లను సిద్ధం చేసుకుని అగళి ఉన్నత పాఠశాలలో వందలాది మొక్కలను నాటడంతోపాటు అగళి మండలంలోని పదులసంఖ్యలోగల పాఠశాలల్లో మొక్కలను నాటారు. వారు ఏ పాఠశాలలకు వెళ్లినా ఆ పాఠశాలతోపాటు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో మొక్కలను నాటిస్తున్నారు. ఈ సందర్భంగా శంకర్ నారాయణ మాట్లాడుతూ. ఏ శుభ కార్యాలయాలుకానీ ఏ భర్త్‌డేలు కానీ ఏ జాతర్లు కానీ జరిగినా ముందుగా మొక్కలను నాటించాలని మొక్కలు వానలకు పిలుపునిస్తాయని, స్వచ్ఛమైన ఆక్సీజన్ మొక్కల వల్ల వస్తుందని అందుకే మొక్కల పెంపకానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం గ్రీన్ భారత్ అధ్యక్షులు కామరాజు సైతం పాల్గొని మండలంలో విరివిగా మొక్కలు నాటిస్తున్నారు. అంతేకాక విచక్షణ రహితంగా పచ్చని చెట్లను నరికితే వారిని అడ్డుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల ఏపిటిఎఫ్ అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, వార్డెన్ సికిందర్ బాషా పాల్గొన్నారు.

## పావగడలో అత్యంత వైభవంగా సంత్ శ్రీసేవాలాల్ జయంతి వేడుకలు

పావగడ, మార్చి 9 ప్రభాతవార్త


కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించిన ప్రరారంభిస్తున్న దృశ్యం

పావగడలో శనివారం సంత శ్రీ సేవాలాల్ 285వజయంతి వేడుకలను లంబాణిలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్‌యుసి మార్కెట్ యార్డు నుంచి మహిళలు నృత్యాలు చేస్తూ యువకులు కూడా డాన్సులు వేస్తూ అత్యంత ఉత్సాహంగా సేవాలాల్ చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం ఎస్ఎస్‌కె రంగ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్ మాట్లాడుతూ.. లంబాడీలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలంటే విద్యకు ప్రాధాన్యత నివ్వాలని విద్యా రంగంలో అభివృద్ధి చెందినప్పుడే అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందుతామన్నారు. ముఖ్యంగా యువకులు దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సరిగమ హనుమంతు, సింగర్ పుండలిక లంబాడిలు ప్రత్యేకఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో మాజీజడ్పిమెంబర్ గాయత్రి భాయి, తాలూకా బిజెపి మాజీ అధ్యక్షులు రవిశంకర్‌నాయక్, శంకర్‌మూర్తి, అక్షరధాసోహ అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి దాదాపు 3వేల మందికిపైగా లంబాడీలు హాజరయ్యారు.

## ఈనెల 12 నుంచి కెజిబివిల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు స్వీకరణ

**- ఎంఈఓ అరుణమ్మ**

కనగానపల్లి, మార్చి 9 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలికల కొరకు 6వ, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి అరుణమ్మ తెలిపారు. (కెజిబివిల్లో) 2024-25 సంవత్సరానికిగాను 6వ, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తేదీ మార్చి 12 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులు కోరడమైంది. ఇందులోఅనాథలు, బడిబయటపిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేదఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీ, బిపి, ఎల్.బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణింపబడుతాయి. ఆన్‌లైన్ దరఖాస్తులు వెబ్‌సైట్ ద్వారా స్వీకరించబడుతాయి. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అవుతుంది. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చునని మండల విద్యాశాఖ అధికారి అరుణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఒక లక్ష ఇరవై వేలు, పట్టణ ప్రాంత విద్యార్థులకు ఒక లక్షా నలబై వేలు మించకూడదని మండల విద్యాశాఖ అధికారి రుణమ్మ తెలిపారు. అవకాశాన్ని బాలికల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

## ఘంటసాల వర్ధంతిని విజయవంతం చేయండి

ధర్మవరం రూరల్, మార్చి 9 ప్రభాతవార్త

పట్టణంలోని కళాజ్యోతి ప్రాంగణములో ఘంటసాల వారి 50వ వర్ధంతి వేడుకలు ఆదివారం సాయంత్రం 6:30 నిర్వహిస్తున్నట్లు కళాజ్యోతి సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కుంటిమల నారాయణ, బాలగొండ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోడ్లు భవనములశాఖ ధర్మవరం అధికారి-సంజీవయ్య హాజరవుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి కాకినాడ వారి పివి రమణ కాకినాడ, వీరలక్ష్మి-గుంతకల్లు, జ్యోతి-అనంతపురం బృందంవారిచే ఘంటశాలపాటల కచేరి నిర్వహిస్తున్న ట్లు కళాజ్యోతి వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి అభిమానులు, ప్రేక్షకులు, శ్రేయోభిలాషులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వైభవంగా లక్ష్మినరసింహుని పల్లకీ ఉత్సవం

ఉరవకొండ, మార్చి 9 ప్రభాతవార్త


శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మినరసింహుని పల్లకీ ఉత్సవం దృశ్యం

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సరం మాఘశుద్ధ చతుర్ధశి శనివారం సాయంత్రం లక్ష్మినరసింహుని పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయవనంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువు దీర్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండికూడా భక్తులుపెద్దఎత్తున తరలి వచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయఅర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా సిద్దేశ్వరస్వామి రథోత్సవం

**- కన్నుల పండువగా పార్వతి పరమేశ్వరుల కళ్యాణం**


భక్తజన సందోహం మధ్య కొనసాగుతున్న సిద్దేశ్వరస్వామి రథోత్సవం


ప్రత్యేక పూజలందుకుంటున్న సిద్దేశ్వరస్వామి

ఉరవకొండ, మార్చి 9 ప్రభాతవార్త

మండల పరిధిలోని పెద్దముష్టూరు గ్రామంలో వెలసిన సిద్దేశ్వరస్వామివారి బ్రహ్మ రథోత్సవం స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సరం మాఘ బహుళ చతుర్దశి శనివారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. గ్రామంలోని అతి పూరాతనమైన చాళుక్యుల కాలం దాదాపు 1,000 సంవత్సరాల సిద్దేశ్వరాలయం నిర్మించిన విషయం తెలిసిందే. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు ఆలయఅర్చకులు, దాతలు, భక్తులు సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథంలో ప్రతిష్టించిన అనంతరం హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తులు రథాన్ని లాగి ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి భక్తిప్రవర్తలను చాటుకొన్నారు. రథోత్సవ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులతోపాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కాగా శుక్రవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అర్ధరాత్రి దాటిన తరువాత పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

**ఆమిద్యాలో రామలింగేశ్వరస్వామి రథోత్సవం :** మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో ఆదివారం సాయంత్రం రామలింగేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ప్రత్యేకంగా ముస్తాబు చేసిన మేళతాళాల మధ్య స్వామివారి ఉత్సవమూర్తిని రథంలో కొలువుదీర్చి శంభో శంకర అంటూ భక్తులు రథాన్ని లాగారు. ఆమిద్యాల చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు.

## నేడు హేంజేరు సిద్ధేశ్వర స్వామి అగ్నిగుండం కార్యక్రమం

అమరాపురం,మార్చి 9,ప్రభాతవార్త:

మండలంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన హేంజేరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగండం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్ దేవదాయ శాఖ ఈఓ నరసింహమూర్తిలు తెలిపారు. ఈ సందర్భంగా విచ్చేసిన వేలాధి మంది క్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక బారికెడర్లను ఏర్పాటు చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ తిప్పేస్వామి,గ్రామ కార్యదర్శి నరేష్ బాబుల ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. హలుకూరు గ్రామానికి చెందిన బెంగళూరు శ్రీధర్ మరియు మిత్ర బృందం ఆధ్వర్యలంఒ విచ్చేసిన భక్తులకు త్రాగునీరు మరియు మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా మడకశిర సీఐ రాజకుమార్, అమరాపురం ఎస్ఐ జనార్థన నాయుడు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మడకశిర ఆర్టీసీ డిపో నుండి అమరాపురం, గుడిబండ, మడకశిర తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక ఆర్టిసి బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

## అలరించిన భక్తప్రహ్లాద నాటిక

పుట్టపర్తి రూరల్ 09 ప్రభాతవార్త

ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శనివారం సాయంత్రం భక్తప్రహ్లాద లను నాటికను శ్రీసత్యసాయి వేదపాఠశాల రిషీకేష్‌కు చెందిన విద్యార్థులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో భక్తప్రహ్లాదను నారాయణుడు నృసింహనిరూపంలో రక్షించేసన్నివేశాలతోపాటు హిరణ్యకసిపున్ని సంహరించిన సన్నివేశాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంరం నాటికలోను నిర్వహించిన విద్యార్థులకు నూతన వస్త్రాలను ట్రస్ట్ వర్గాలు బహుకరించాయి. అనంతరం భకిగీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,సాయిభక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


నాటికలోని ఒక సన్నివేశం

## నేడు ఉరవకొండలో టీడీపీ శంఖారావం సభ..!

**- హాజరు కానున్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ - జాతీయ రహదారి భారత్ పెట్రోల్ బంకు పక్కన ముమ్మరంగా ఏర్పాట్లు**

ఉరవకొండ, మార్చి 9 ప్రభాతవార్త


శంఖారావం సభకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యాలు



నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండలో నేడు (ఆదివారం) తెలుగుదేశం పార్టీ శంఖారావం సభ జరుగనుంది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హాజరై బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో పట్టణ శివారు భారత్ పెట్రోల్ బంకు పక్కన ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నారా లోకేష్ హైదరాబాద్ నుంచి చాపర్ (హెలికాప్టర్)లో బయలుదేరి ఉదయం 10 గంటలకు ఉరవకొండ చేరుకొని నేరుగా సభా వేదిక వద్దకు చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. 10 గంటలకు తొలుత పార్టీ అనంతపురం పార్లమెంటు అధ్యక్షుడు బి.కె.పార్థసారధి ప్రసంగం, 10.05 గంటల ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన అధ్యక్షుడు టి.సి.వరుణ్ ప్రసంగం, 10.15 గంటలకు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన టీడీపీ యాప్‌లో ప్రతిభ కనబర్చిన వారికి లోకేష్ అభినందించనున్నారు. 10.32 గంటలకు జనసేన పార్టీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త గౌతమ్‌కుమార్ ప్రసంగం, 10.34 గంటలకు పార్టీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ప్రసంగం, 10.36 గంటలకు నారా లోకేష్ ప్రసంగించనున్నారు. 10.56 గంటలకు పార్టీ కేడర్‌లో లోకేష్ ముఖాముఖి, 11.26 గంటలకు పార్టీ కేడర్‌కు లోకేష్ చేతుల మీదుగా సూపర్-6 కిట్ల అందజేత, 11.28 గంటలకు పార్టీ కేడర్‌తో లోకేష్ ప్రతిజ్ఞ చేయించనున్నారు. 11.29 గంటలకు పార్టీ కేడర్‌తో లోకేష్ గ్రూప్ సెల్ఫీ అనంతరం అక్కడి నుండి లోకేష్ బయలుదేరి 12.50 గంటలకు రాయదుర్గం చేరుకోనున్నారని పార్టీ వర్గాల తెలిపాయి.

## వైభవంగా జరుట్ల రామలింగేశ్వరస్వామి బ్రహ్మారథోత్సవం

**- రామలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు**

ఉరవకొండ, మార్చి 9 ప్రభాతవార్త


జరుట్ల రామలింగేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం కొనసాగుతున్న దృశ్యం




ప్రత్యేక పూజలందుకొంటున్న జరుట్ల రామలింగేశ్వరుడు, ప్రత్యేకాలంకరణలో జరుట్ల రామలింగేశ్వరుని ఉత్సవమూర్తి

వజ్రకరూరు మండలం దక్షిణ కాశీగా పిలువబడే జె.రాంపురం గ్రామంలో వెలసిన జరుట్ల రామలింగేశ్వరస్వామివారి బ్రహ్మ రథోత్సవం స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సరం మాఘ బహుళ చతుర్దశి ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. మహా శివరాత్రి పర్వదినం శుక్రవారం రోజు నుండి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా అదేరోజు రాత్రి 12 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం రామలింగేశ్వరుడు, పార్వతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో అలంకరించిన రథంలో కొలువుదీర్చి పూజలు జరిపిన అనంతరం హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తులు రథాన్ని లాగారు. కాగా దేశంలోనే ఒక విశిష్టమైన స్థానం సంపాధించుకున్న ఆలయం కావడంతో ఉదయం నుండే వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తగా సాయంత్రానికి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కాగా రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి అంగదాల క్రిష్ణయ్య, ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఉదుగూరులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అమరాపురం,మార్చి 9,ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఉదుగూరు గ్రామం నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధులుగా ఏరియా టీమ్ లీడర్ కె.సావిత్రి,ఏటిఎల్ బలయ్య, నెట్వర్క్ లీడర్ అనిత,కృష్ణవేణి,సిఓ చంద్ర,సిడిసి సభ్యులు శంకర్, తిప్పేస్వామి,దేవరాజు,మల్లేస్ సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డిటీ ఎటిఎల్ మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర కీలకమన్నారు. అంతర్జాతీయ మహిళా దానోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలోనూ మహిళల దినోత్సవం జరుపుకోవడం ద్వారా వారిలో నూతన చైతన్యం వస్తున్నట్లు సిఓ చంద్ర తెలిపారు. మహిళలు ఎక్కడ పూజింపబడుతారో అక్కడ దేవతలు కోలువై ఉంటారు అని నానుడి నిదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. సంఘాలలోని మహిళలకు వారు ప్రతి నెల పోదుపుచేసుకోన్న డబ్బును 54 మందికి ఒక్కోక్కరికి 9000 రూపాయల ప్రకారం మొత్తం 7,56,000 వారిపేరుమీద పిక్స్‌డ్ డిపాజిట్ మహిళా దినోత్సవం రోజున చేయించడం జరిగింది. అందుకు మహిళలు చాలా సంతోషిస్తూ ఇది మా పుట్టింటి వారు ఇచ్చింది కాదు. మెట్టినింటివారు ఇచ్చింది కాదు. ఇది మా కష్టార్జితమని తెలిపారు. అదేవిధంగా ఈ నెల నుండి పొదుపు 200 రూపాయలు చేసుకుంటూ వచ్చే సంవత్సరం మహిళా దినోత్సవానికి మరోక బాండ్ చేసుకుంటామని మహిళలు ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు సభ్యులు ఆట పోటిలు నిర్వహించి విజేతలకు ఆర్డిటీ సంస్థ అధికారుల చేత బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.

## కల్బుర్గిలో ఎన్ఐఎ సోదాలు

కల్బుర్గి,మార్చి 9,ప్రభాతవార్త ప్రతినిధి :

బెంగళూరు రామేశ్వరం కెఫెలో బాంబులు పేల్చిన దుండగుడి ఆచూకీ తెలుసుకునేందుకు జాతీయదర్యాప్తు ఏజెన్సీ పోలీస్ అధికారులు శనివారం కల్బుర్గి బస్టాండ్‌లో సోదాలు జరిపారు. బాంబు దుండగుడు బళ్లారి నుంచి గుల్బర్గా వైపునకు తరువాత బీదర్‌కు ఆర్టీసి బస్సులో ప్రయాణించాడని కచ్చితమైన సమాచారంమేరకు పోలీసులు ఇవాళ గుల్బర్గాఆర్టీసి బస్టాండ్‌లోని 18సిసి కెమేరాల ఫుటేజిని సేకరించి వాటిని విశ్లేషించే పనిలో పడ్డారు. సదరు బాంబు యువకుడు ప్రయాణించిన బస్సు కండక్టరును కూడా ఎన్ఐఎ అధికారులు విచారణ జరిపి సమాచారం సేకరించారు. కల్బుర్గి నుంచి బీదర్‌కు ఎవెళ్లాడా లేక మరోచోటుకు వెళ్లాడా అనే కోణంలో ఎన్ఐఎ అధికారులు దుండగుడి ట్రావెల్ హిస్టరీను బయటకు తీసే పనిలో నిమగ్నం అయ్యారు.

## రఘువీరారెడ్డి పర్యటనను విజయవంతం చేయండి మాజీ ఎమ్మెల్యే సుధాకర్

గుడిబండ, మార్చి 9 ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సుధాకర్

ఎన్నికల ప్రచారంలో భాగంగా గొల్ల మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో త్వరలో జరగబోయే సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రొళ్ల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి కమ్యునిటీ భవనంలో మండల అధ్యక్షులు గౌడప్ప ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్యసాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంఎల్ఏ కరికెర సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మాజీ మంత్రి సిడబ్ల్యూసి సభ్యులు నీలకంఠాపురం రఘువీరారెడ్డి ప్రతి గ్రామానికి ఎన్నికల ప్రచార నిమిత్తం వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పర్యటనను విజయవంం చేయాలని కోరారు. నియోజకవర్గంలో అర్ధాంతరంగా ఆగిపోయిన అభివృద్ధి పనులు, రైల్వే లైన్, రైతులకు హంద్రీనివా కాలువ ద్వారా సాగునీరు తదితర పథకాలు పూర్తి కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ బిఎన్.నరసింహమూర్తి, గంగులవాయిపాళ్యం ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు మీసాల చౌడప్ప, మైనార్టీ సెల్ అధ్యక్షులు అన్వర్, జిల్లా కార్యదర్శి సతీస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్నాథ్, పాండురంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, దాసేగౌడ్, శ్రీరంగప్ప, ఉద్దప్ప, రంగనపల్లి రాయుడు, సన్నదాసప్ప, రంగనాథప్ప, రామకృష్ణ, శేషాద్రి తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిభిరమును సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం రూరల్, మార్చి 9 ప్రభాతవార్త


మాట్లాడుతున్న అధ్యక్షులు బి.జయసింహా

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత కంటి వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు బి.జయసింహా, కార్యదర్శి డి.నాగభూషణ, కోశాధికారి వై.సుదర్శన్ గుప్తా తెలిపారు. ఈసందర్భంగా సాంస్కృతిక మండలిలో రోటరీ క్లబ్ శిబిరం కరపత్రాలను విడుద లచేయడం జరిగింది. రోటరీ క్లబ్ తరపున దాదాపు 32,500 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించామని తెలిపారు. కంటి ఆపరేషన్లను వచుచ వారు తమ వెంట ఆధార్‌కార్డు లేదా రేషన్‌కార్డు, ఓటర్‌కార్డు, రెండు జిరాక్స్ కాపీలు, ఫోటోలు మూడు, ఫోన్ నెంబర్ గల చిరునామాతో రావాలని తెలిపారు.

## శివనామ స్మరణంతో కిటకిటలాడిన శివాలయాలు

ధర్మవరం రూరల్, మార్చి 9 ప్రభాతవార్త


స్వామివారిని అలంకరించిన దృశ్యం

పట్టణములోని పలు దేవాలయాలు శివనామస్మరణంతో హరహర మహాదేవ అంటూ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని కొన్ని దేవాలయాలలో శివపార్వతుల కళ్యాణోత్సవమును భక్తాదుల నడుమ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అత్యంత వైభవంగా వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన వైనం చోటు చేసుకుంది. ప్రతి దేవాలయాన్ని భక్తాదులు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వివిధ పూలమాలలతో, టెంకాయల పట్టలతో, మామిడాకులతో అలంకరించిన వైనం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. ఓంకార నాదం.. వందే శివం శంకరం అన్న శబ్దం దేవాలయాల్లో హోరెత్తించాయి.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి కృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్, మార్చి 9 ప్రభాతవార్త


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం మండల పరిధిలోని రావుల చెరువు గ్రామంలో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న లక్ష్మినరసమ్మ అనారోగ్యంతో చికిత్స నిమిత్తం బెంగుళూరులో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెచ్చిన అనంతరం ఆ కుటుంబ సభ్యులు బాధలో అంత్యక్రియలకు కూడా డబ్బు లేదని తెలుసుకున్న స్థానిక వైసీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి తక్షణమే ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి శనివారం తన నివాసంలో సోదరుడు వెంకటకృష్ణారెడ్డి చేతులు మీదుగా అంత్యక్రియలకు 20వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కేతిరెడ్డి సోదరుడికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఈ నెల 11న లేపాక్షిలో పిఎం నామ్ అప్రెంటిషిప్ మేళా

కొత్తచెరువు, మార్చి 09, ప్రభాతవార్త


డిఐఎఓ రఘునాథ్ రెడ్డి

ఈ నెల 11వ తేదిన లేపాక్షిలో పిఎం నామ్ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ మేళాకు ఇంటర్మీడియట్ ఒకేషనల్ గ్రూప్, ఐటిఐ చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులని, కియా మోటర్స్, విప్రో, బర్గర్ పేయింట్స్, రవిశంకర్ ఇండస్ట్రీస్, రోల్‌వెల్ ఇండస్ట్రీస్, హోండై మొబైల్స్ అండ్ స్టీల్స్, కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఇంటర్వ్యూలకు ఎంపికైన విద్యార్థులకు వివిధ కంపెనీలలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టైఫండ్ చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ మేళాలో పాల్గొన దలచిన విద్యార్థులు తమ బయోడేటా, ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9490445744, 9440258629 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ఒకేషనల్, ఐటిఐ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

